ముురుగుతో అవస్థలు !



చెత్త, వ్యర్థాలతో మురుగు కాలువ

- దుర్గంధం వెదజల్లుతున్న పట్టించుకోని అధికారులు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు

బండ్లగూడ: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా రోజూ పారిశుద్ధ్య కార్మికులు చెత్త చెదారాలు, వ్యర్థాల తొలగింపు కార్యక్రమాలు చేపడుతున్నా.. ప్రధాన రహదారి పక్కన ఉన్న మురుగు కాలువను మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

- బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రధాన జాతీయ రహదారి పక్కన ఉన్న మురుగు కాలువ నిండి దుర్గంధం వెదజల్లుతోంది. ఆ రహదారి మీదుగా వెళ్లే వారు దుర్వాసనతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.
- వ్యర్థాలతో నిండి పర్యావరణానికి పెను ముప్పుగా మురుగు కాలువ తయారైంది. మురుగు కాలువల్లో ప్లాస్టిక్ కవర్లు, బాటిల్‌లతో నిండి నీరు ఎటుపోకుండా ఎక్కడికక్కడే నిలిచిపోతోంది. దీంతో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో దుర్వాసన కూడా వెదజల్లుతోంది. అధికారులకు పలుసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.



ప్రధాన రహదారి పక్కన ఇలా..

జాతీయ రహదారి పక్కనే..

కార్పొరేషన్ పరిధిలోని హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి ఇరు పక్కల ఉన్న ఖాళీ ప్రదేశాల్లో చెత్తను వేస్తూ.. డంపింగ్ యార్డులుగా తయారు చేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- ప్లాస్టిక్ కవర్లు, మటన్, చికెన్ సెంటర్ల నుంచి వెలువడే వ్యర్థాలను చెత్తలో వదిలి రోడ్డు పక్కనే వేస్తున్నారు. దీంతో ఈగలు, దోమలతో పాటు దుర్గంధం వ్యాపిస్తోందని ఆ రోడ్డు మీదుగా వెళ్లే పాదచారులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు పట్టించుకుని రోడ్డు ఇరు పక్కలా శుభ్రం చేయాలని వారు కోరుతున్నారు.

రూ.1.04 కోట్లతో అభివృద్ధి పనులు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, కార్పొరేటర్ మొండ్ర సంగీతాగౌరీశంకర్

రాజేంద్రనగర్: ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం ఎప్పటికప్పుడు అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, కార్పొరేటర్ మొండ్ర సంగీతాగౌరీశంకర్‌లు అన్నారు. అత్తాపూర్ డివిజన్ పరిధిలో రూ.1.04 కోట్లతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కాంతారెడ్డినగర్, తేజశ్రీనగర్, శివానగర్, కృష్ణానగర్ ఓల్డ్ విలేజ్, హుడా కాలనీలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల్లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులను నిర్వహిస్తున్నామన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. డివిజన్ అధ్యక్షులు శ్రీరామ్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, అమరేందర్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం



పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ కె.లక్ష్మణ్

రాజేంద్రనగర్: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. 'ఖేలో భారత్ జీతో భాగ్యనగర్' పేరిట నిర్వహిస్తున్న ఖోఖో క్రీడలను మహవీర్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ప్రారంభించారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బాస్కెట్ బాల్ పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. భాగ్యనగర్ జిల్లాకు చెందిన 26 ఖోఖో టీమ్‌లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులు పాల్గొనేలా చూడాలని కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణకు చెందిన నిఖత్ జరీన్ బాక్సింగ్ పోటీల్లో తన ప్రతిభను చాటుతుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. డాక్టర్ బీ.వీ.శంకర్‌రామ్ తదితరులున్నారు.

క్లుప్తంగా...

ఏజీవర్సిటీలో క్యాంపస్ సెలక్షన్స్



ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఆధ్వర్యంలో అసిస్టెంట్ మేనేజర్స్ కోసం క్యాంపస్ సెలక్షన్ నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ సెలక్షన్స్‌లో 150 మంది విద్యార్థులు పాల్గొనగా.. వారికి ఆన్‌లైన్‌లో వ్రాత పరీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ చీనానాయక్ మాట్లాడుతూ.. కళాశాలలో ఉద్యోగాల కోసం క్యాంప్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు వారికి నచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని సూచించారు. భవిష్యత్తులో పలు సంస్థల ద్వారా నియామకాలు చెప్పటే విధంగా చూస్తామన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్స్ సాయికృష్ణ, నిఖిల్, అశ్వినికుమార్, శ్రీనాథ్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్విట్టర్ పోస్టుతో వృద్ధాశ్రమానికి చేరిన వృద్ధురాలు

రాజేంద్రనగర్: మతిస్థిమితం లేక రెండు రోజులుగా ఓ వృద్ధురాలు పడి ఉండటంతో స్థానికులు ట్విట్టర్ ద్వారా పోలీస్ కమీషనర్, జీహెచ్ఎంసీ కమీషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో జీహెచ్ఎంసీ, షీటీమ్, స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వృద్ధురాలిని వృద్ధాశ్రమానికి తరలించారు. హసన్‌నగర్ ప్రాంతంలోని డికెన్‌కింగ్ ఎలైట్ ఫంక్షన్‌హాల్ పక్కనే రెండు రోజులుగా మతిస్థిమితం లేని ఓ వృద్ధురాలు నగ్నంగా పడి ఉంది. దీంతో స్థానిక యువకుడు హుస్సేన్ ఫోటో తీసి ట్విట్టర్ ద్వారా నగర పోలీస్, జీహెచ్ఎంసీ కమీషనర్లకు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం సాయంత్రం రాజేంద్రనగర్, జీహెచ్ఎంసీ ప్రాజెక్టు అధికారిణి రాధారాణి, షీ టీమ్ పోలీసులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వృద్ధురాలికి భోజనం చేయించి వివరాలను సేకరించేందుకు ప్రయత్నించారు. ఎలాంటి వివరాలు చెప్పకపోవడంతో ఆమెను వృద్ధాశ్రమానికి తరలించారు.

రోడ్డుపై నెమలి మృతి




పోలీసులకు అప్పగిస్తున్న శివకుమార్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డీఆర్ఆర్ ప్రాంతంలో బుధవారం ఉదయం నెమలి మృతి చెందడంతో స్థానిక యువకుడు రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించాడు. ఉదయం వాకింగ్‌కు వెళ్లిన శివకుమార్ అనే వ్యక్తికి రోడ్డు పక్కన నెమలి మృతి చెంది కనిపించింది. దీంతో అతడు పోలీసులకు సమాచారం అందించగా.. వారు నెమలి కళేబరాన్ని స్వాధీనం చేసుకుని అటవీశాఖ అధికారులకు అప్పగించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

శంషాబాద్ రూరల్: ఫామ్‌హౌజ్‌లోని ఓ బావిలో పడి గుర్తు తెలియని వ్యక్తి (45) మృతి చెందిన ఘటన గొల్లపల్లిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో మియాన్ ఫామ్‌హౌజ్‌లో పనిచేసే శంకర్ అక్కడ ఉన్న బావిలో మృతదేహాన్ని బుధవారం గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. మృతుడి కుడిచేతిపై చెన్నకేశవులు అనే పేరుతో పచ్చబొట్టు ఉందని ఎడమ చేతిపై రెండు పువ్వు గుర్తులు ఉన్నాయి. తెలుపు రంగు బనియన్, షర్టు ధరించి ఉన్నాడు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీఎంబీ సభ్యుడిగా ప్రొఫెసర్ పవన్‌కుమార్



ప్రొఫెసర్ పమ్మి పవన్‌కుమార్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ ఫ్యాకల్టీ ప్రొఫెసర్ పమ్మి పవన్ కుమార్ క్లాసికల్ తెలుగులో అధ్యయనాల కోసం సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీఈఎస్‌సీటీ), రచనలకు ప్లానింగ్–కమ్–మానిటరింగ్ బోర్డు (పీఎంబీ) సభ్యుడిగా నామినేట్ అయ్యారు. సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ (సీఐఐఎల్–మైసూర్) కింద కేంద్ర ఉన్నత విద్యా శాఖ ద్వారా ఈ నియామకం జరిగింది. సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫర్ స్టడీస్ ఇన్ క్లాసికల్ తెలుగు (సీఈఎస్‌సీటీ) వివిధ విద్యా పథకాలు, పరిశోధన కార్యకలాపాల అమలును పీఎంబీ పర్యవేక్షించడమే కాకుండా మార్గనిర్దేశం చేస్తుంది. ప్రొఫెసర్ పమ్మి పవన్‌కుమార్ సీఈఎస్‌సీటీ ప్లానింగ్ కమ్ మానిటరింగ్ బోర్డు సభ్యుడిగా మూడేళ్లపాటు వ్యవహరిస్తారు. ఆయనను పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

విద్యార్థులు తమ సామర్థ్యాలను పెంచుకోవాలి



కాంక్లేవ్‌కు హాజరైన పారిశ్రామిక వర్గాలు

మణికొండ: విద్యార్థులు తమ సామర్థ్యాలను ఎప్పటికప్పుడు పెంచుకోవటంతో పాటు ప్రపంచ పోకడలు, పారిశ్రామిక రంగ మార్పులను గమనించి దానికి అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకున్నప్పుడే రాణించగలుగుతారని పలు పారిశ్రామిక వర్గాల అధిపతులు, ప్రతినిధులు అన్నారు. ఎంజీఐటీ కళాశాలలో బుధవారం ఇండస్ట్రీ ఇనిస్టిట్యూట్ కాంక్లేవ్‌ను నిర్వహించారు. కళాశాల చైర్మన్ ప్రవీణ్‌రెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిగ్నిటీ టెక్నాలజీ గ్లోబల్ హెడ్ పి.వీరారెడ్డి, సాలర్‌పురియా సత్త్వా వైస్ ప్రెసిడెంట్ ఆర్. వెంకటేశ్వర్‌రావు, హిటాచీ వంటనా ప్రతినిధి ప్రశాంత్, విట్రెసా ప్రతినిధి ఎం. వెంకట చలపతి, స్టే జెట్ ఏరోస్పేస్ ప్రతినిధి సీవీ కిరణ్, వీవీ. కృష్ణారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డిలు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలంటే ఓర్పుతో పాటు ప్రాథమిక అంశాల మీద పట్టు సాధించాలని సూచించారు. ప్రతిభా సామర్థ్యాలతో పాటు నైతిక విలువలకు సంస్థలు పెద్దపీట వేస్తున్నాయన్నారు. ధృడమైన సంకల్పంతో సామాజిక బాధ్యత కలిగి ఉండాలని సూచించారు.

ఎమ్మెల్యే అభినందన



విద్యార్థులతో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు

శంషాబాద్: ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అభినందించారు. పట్టణంలోని 17వ వార్డు కౌన్సిలర్ మేకల వెంకటేష్ ముదిరాజ్ కుమార్తె హాసిని బైపీసీ విభాగంలో 982 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో పదోర్యాంకు సాధించింది. రాళ్లగూడ బస్తీకి చెందిన బండి శ్రీధర్‌యాదవ్ కుమార్తె ప్రణతి ఎంపీసీలో 989, ఎయిర్‌పోర్టు కాలనీకి చెందిన బొల్లు భవ్య 989 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ఏడో ర్యాంకు సాధించడం అభినందనీయమన్నారు. చదువులో రాణిస్తున్న విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నతమైన చదువులు చదివి వారి తల్లిదండ్రులకు మరింత మంచిపేరు తీసుకురావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. నార్సింగి ఏఎంసీ చైర్మన్ వెంకటేష్‌గౌడ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ బండి గోపాల్ యాదవ్, కౌన్సిలర్లు మేకల వెంకటేష్‌ముదిరాజ్, నాయకులు శ్రీకాంత్‌యాదవ్, కొనమొల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో సత్తా చాటిన పయనీర్ స్కూల్



విద్యార్థులను అభినందిస్తున్న స్కూల్ చైర్మన్ ఎస్.ప్రమోద్‌రెడ్డి

రాజేంద్రనగర్: పదో తరగతి ఫలితాల్లో కాటేదాన్ టీఎన్‌జీఓస్ కాలనీ మణికంఠ హిల్స్ పయనీర్ కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ ఎస్.ప్రమోద్‌రెడ్డి, కరస్పాండెంట్ ఎస్.ప్రవీణారెడ్డి, డైరెక్టర్ ఎస్.సాకేత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ తృప్తి పాటిల్‌లు విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు. పాఠశాలకు చెందిన ప్రియదర్శి (10/10), ఆర్.ఉదిత్‌కుమార్(10/10), కె.వైభవ్ (10/10) జీపీఏలు సాధించి ఉత్తమ ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రూ.10 వేల నగదును అందజేశారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు ధ్వంసం



ధ్వంసమైన ఇల్లు

రాజేంద్రనగర్: ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి ఓ భవనంలోని రెండో అంతస్తు ధ్వంసమైంది. పేలుడు దాటికి భవనంలోని రెండు గదులు పూర్తిగా కూలిపోయాయి. ఈ ఘటన జరిగిన సమయంలో ఇంట్లోని వారందరూ.. కిందకు రావడంతో పెను ప్రమాదం తప్పింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన రవిరంజన్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి నగరానికి వలస వచ్చాడు. కాగా.. కాటేదాన్ పారిశ్రామికవాడలో పనిచేస్తూ దుర్గానగర్ ప్రాంతంలోని ఓ మూడు అంతస్తుల భవనంలోని రెండో అంతస్తులో నివసిస్తున్నాడు. రెండు రోజుల క్రితం రవిరంజన్ తన గ్యాస్ సిలిండర్ నిండుకోవడంతో బుక్ చేశాడు. ఉదయం గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు సిలిండర్‌ను అతడికి అందించారు. ఉదయం భార్య సిలిండర్‌ను అమర్చి వంట చేసేందుకు వెలిగించింది. ఒక్కసారి గ్యాస్ లీకై మంటలు రావడంతో భయభ్రాంతులకు గురై తన 6 నెలల కుమారుడిని తీసుకుని ఇంట్లో నుంచి బయటికి పరుగులు తీసింది. మంటలు వస్తుండడంతో మూడు అంతస్తుల్లో ఉన్న వారంతా కిందకు దిగారు. దిగిన నిమిషంలోనే భారీ శబ్దంతో సిలిండర్ పేలిపోయింది. ఈ పేలుడు దాటికి రెండో అంతస్తులోని రెండు గదులు పూర్తిగా కూలిపోయాయి. విషయం తెలుసుకున్న ఫైర్ సిబ్బందితో పాటు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాద సమయంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శంషాబాద్‌లోకి 'భట్టి పీపుల్స్ మార్చ్'



భట్టి విక్రమార్కకు జ్ఞాపికను అందజేస్తున్న సీనియర్ మహిళా నాయకురాలు

శంషాబాద్: సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ యాత్ర బడంగ్‌పేట్ కార్పొరేషన్ మామిడిపల్లి నుంచి శంషాబాద్ మున్సిపాలిటీకి చేరింది. పీసీసీ ప్రధాన కార్యదర్శులు వేణుగౌడ్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, రాచమల్ల సిద్దేశ్వర్, సీనియర్ మహిళా నాయకురాలు మైలారం సులోచన, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పి. సంజయ్‌యాదవ్‌లు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ధర్మగిరి, అప్పాడ్‌నగర్, సంజయ్‌వాడ, కోమటిబస్తీ, బ్రాహ్మన్‌వాడీ మీదుగా ఆయన పాదయాత్ర పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వరకు చేరకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగులను నిండా ముంచుతున్న రాష్ట్ర ప్రభుత్వ తీరును విద్యావంతులు గమనించాలన్నారు. ప్రాణహిత–చేవెళ్లను పక్కనపెట్టి పాలమూరు రంగారెడ్డి పథకం పెట్టిన సీఎం కేసీఆర్ దాని ద్వారా రంగారెడ్డి జిల్లా రైతులు, ప్రజలకు జరిగిన మేలును శ్వేతపత్రంలో వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రజలను మభ్యపెట్టి దోచుకోవడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఆరోపించారు. రాష్ట్రాన్ని అందించిన నేతలనే కించపరిచే స్వభావం కలిగిన బీఆర్ఎస్‌కు రోజులు దగ్గరపడ్డాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

స్వాగతం పలికిన స్థానిక నేతలు

మణికొండ: కాంగ్రెస్ పార్టీ సీఎల్పీ లీడర్ మల్లు బట్టి విక్రమార్క చేపట్టిన 'పీపుల్స్ మార్చ్' పాదయాత్ర బుధవారం రాత్రి రాజేంద్రనగర్ నియోజకవర్గంలోకి అడుగుపెట్టడంతో గండిపేట మండలానికి చెందిన నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. మండల పరిధిలోని మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలకు చెందిన నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లి ఘనంగా స్వాగతం పలికారు. మణికొండ మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్, పార్టీ అధ్యక్షుడు జితేందర్, కౌన్సిలర్ లక్ష్మీనారాయణ, కో–ఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, నాయకులు ముత్యాలు, కిరణ్‌కుమార్, ధన్‌రాజ్, శ్రీనివాస్‌రెడ్డి, షేక్‌హాజీ, నార్సింగి మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్‌తో పాటు నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సత్తా చాటిన విద్యార్థులు



నిహారిక 10/10 | సదియా బేగం 9.8 | మహేశ్వరి 9.7 | పాలక్‌సింగ్ 9.5 | నవ్యశ్రీ 9.5 | కోమల్ 9.8 | వైష్ణవి 10/10



పూటీ 10/10



అఖిల్‌మూర్తి 10/10

మణికొండ: పదో తరగతి ఫలితాల్లో గండిపేట మండలంలోని విద్యార్థులు 72 శాతం ఫలితాలు సాధించారు. వారిలో నార్సింగి సాంఘీక సంక్షేమ గురుకుల విద్యార్థినులు వంద శాతం ఫలితాలతో సత్తా చాటారు. తరువాతి స్థానంలో కిస్మత్‌పూర్‌లోని కస్తూర్బా గాంధీ విద్యాలయ విద్యార్థులు 96 శాతం ఫలితాలతో రెండో స్థానంలో నిలిచారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో నార్సింగి ఉన్నత పాఠశాల 78 శాతం ఫలితాలతో మొదటి స్థానంలో నిలవగా.. రెండో స్థానంలో 77 శాతం ఫలితాలతో మణికొండ ఉన్నత పాఠశాల నిలిచింది. మూడో స్థానంలో వట్టినాగులపల్లి 60 శాతం ఫలితాలు, నాల్గో స్థానం హైదర్షాకోట్ 53 శాతం ఫలితాలు, చివరి స్థానంలో కోకాపేట్ 43 శాతం ఫలితాలతో నిలిచింది.

- నార్సింగి సాంఘీక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయానికి చెందిన నిహారిక 10/10 గ్రేడ్ సాధించి మండల టాపర్‌గా నిలిచింది. నార్సింగి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని 9.8 గ్రేడ్‌తో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. మణికొండ ఉన్నత పాఠశాలకు చెందిన మహేశ్వరి 9.7, పాలక్ సింగ్ 9.5, నవ్యశ్రీ 9.5 గ్రేడ్‌లను సాధించారు.

రాజేంద్రనగర్‌లో..


రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో కోమల్ 9.8 జీపీఏ సాధించి రాజేంద్రనగర్ మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులలో టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు హన్మంతు ఈ సందర్భంగా విద్యార్థిని ఘనంగా సన్మానించి అభినందించారు.

- మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులు బుధవారం విడుదలైన ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధించినట్లు ఎంఈఓ రామిరెడ్డి తెలిపారు. మండల వ్యాప్తంగా 73 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. మొత్తం 1004 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 654 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. 10/10 జీపీఏ ముగ్గురు విద్యార్థులు సాధించారన్నారు.
- విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని మరింత పెంచేందుకు తగిన ప్రణాళికతో విద్యాబోధన చేస్తున్నట్లు తెలిపారు.

మోడల్ స్కూల్ విద్యార్థికి 10 జీపీఏ

శంషాబాద్ రూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి పరీక్షల్లో మిశ్రమ ఫలితాలు సాధించాయి. 11 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు సాంఘిక సంక్షేమ, మోడల్ స్కూలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నుంచి పదోతరగతి పరీక్షలకు హాజరైన విద్యార్థుల్లో కేవలం ఒక్కరు మాత్రమే జీపీఏ 10 మార్కులు సాధించడం గమనార్హం. పాల్మాకులలోని మోడల్ స్కూల్ విద్యార్థి కె.అఖిల్‌మూర్తికి జీపీఏ 10 మార్కులు వచ్చాయి. ఆయా పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం 46 నుంచి 94 వరకు నమోదైంది. అత్యల్ప ఉత్తీర్ణత పెద్దతూప్ర పాఠశాల కాగా.. ఇక్కడ 15 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. కేవలం 7 మంది మాత్రమే పాసయ్యారు. అత్యధిక ఉత్తీర్ణత 94 శాతం మోడల్ స్కూల్ నమోదు చేసింది.

'మనూ'లో సెల్ఫీ పాయింట్ ప్రారంభం



రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం (మనూ)లోని ఉర్దూ మీడియం ఉపాధ్యాయుల వృత్తిపరమైన అభివృద్ధి కేంద్రం (సీపీటీయూఎంటీ) వద్ద 'మనూ' సెల్ఫీ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. బుధవారం ఈ సెల్ఫీ పాయింట్‌ను ఉర్దూ యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సెల్ఫీ పాయింట్ అనేది సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా విశ్వవిద్యాలయంలో వారి అనుభవాలను సంగ్రహించడానికి, పంచుకోవడానికి విద్యార్థులు, అధ్యాపక సభ్యులను ప్రోత్సహించే ఒక వినూత్న కార్యక్రమమన్నారు. సెల్ఫీ పాయింట్ ఒక శక్తివంతమైన ప్రదేశంగా రూపొందించబడుతుందన్నారు. ఇది సెల్ఫీలు, సామూహ ఛాయాచిత్రాల కోసం జీ20, యూనివర్శిటీ లోగోల నేపథ్యాన్ని అందిస్తుందన్నారు. అదనంగా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ యూసుఫ్‌ఖాన్ రూపొందించిన జీ20 లోగోతో క్యాప్స్, టీ షర్టులు, బ్యాచ్‌లు కూడా ప్రారంభించబడ్డాయి, కార్యక్రమంలో పలువురు ప్రొఫెసర్లు, అధ్యాపకులు, అధికారులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.